# బలిపశువు

ఆ రోజు అమ్మోరు పండగ. పేట పేటకు అమ్మోరు గుడుల్లో కొలువు తీరి వుంది. అందుకే ఆ రోజు ఊరు వాడ పండగ సందడే! ఓ పక్క డప్పుల మోతలు, బోనాల సందడి! మరోపక్క భక్తుల సందడి.

యాదమ్మ కూతురు అంతమ్మ, మిగిలిన చిన్న పిల్లలిద్దరూ గుడికి వెళ్ళి పూజలు చేసి నైవేద్యాలు పెట్టి బయటకు వచ్చారు. మరోసారి అమ్మోరుకి దండం పెట్టుకున్నారు. అంతలో డప్పులు, వాయిద్యాల మధ్యలో ఓ మేకపోతును పసుపు కుంకుమలతో అలంకరించి మెడలో బంతిపూల దండవేసి చెవులు పట్టుకుని లాక్కు వస్తున్నారు. అది మొరాయిస్తూ 'మే! మే!' అని అరుస్తోంది. కొందరికి వినోదాన్ని కలిగిస్తున్నా, పిల్లలకు మాత్రం ఆ దృశ్యం భయంకరంగా అనిపించింది.

"అమ్మో! అదేందే? దాని సెవులు ఊడిపోతాయే!" అంటూ అంతమ్మ చెల్లి, తమ్ముడు గోల చేసారు.

"ఎందుకే లాక్కుపోతున్నారు? ఓయమ్మా! సెప్పవే?"

13 సంవత్సరాల అంతమ్మ ఆ మేకపోతును చూడలేకపోయింది. ఆమె మనసు వికలమైపోయింది. తననే లాక్కుపోతున్నట్లు భయంతో వణికింది.

"అటు సూడబోక! నడు నడు!" అంటూ యాదమ్మ ముగ్గురు పిల్లల్ని చేతులు పట్టుకొని ముందుకు లాక్కుపోతుంది. అంతమ్మ వెనక్కి తిరిగి చూస్తూనే ఉంది. ఆమె గుండె కలుక్కుమంటోంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగి పైటను ఆశ్రయిస్తున్నాయి.

"ఏందే? ఓయమ్మో! ఇదేందే?" అంటూ తల్లి వెంట అడుగులు వేస్తూనే ఉంది.

"అది బలిపశువు! దాని తల నరికి అమ్మోరుకి బలి ఇస్తార"ని మాత్రం యాదమ్మ పిల్లలకు చెప్పలేకపోయింది.

నాగరికతా ప్రపంచంలో అనాగరికత, మూఢాచారాలు ఇంకా బుసలు కొడుతూనే ఉన్నాయి. ఎన్ని చట్టాలు వచ్చినా చట్టం కళ్ళు కప్పి తమ పనులు చేసుకుపోతూనే ఉన్నారు. మరి ఇది స్వేచ్ఛా ప్రపంచం కదా!

ఆ దృశ్యం చూశాక యాదమ్మ మనస్సు ఉలిక్కిపడింది. "తన కూతుర్ని కూడ బలి పశువును చేస్తున్నానా? దాన్ని కూడా ఇలాగే లాక్కుపోతారా?" యాదమ్మకు తప్పు చేసానేమో? అనే బాధ బయలుదేరి తల్లి పేగును నులిపేసింది.

యాదమ్మకు భర్త చనిపోయాడు. బతికినంతకాలం కూలి డబ్బులతో తాగి వచ్చి భార్యాపిల్లలను చావకొట్టేవాడు. యాదమ్మ పని చేసుకుని ఇంటిని పోషించుకునేది. దరిద్రం వారి పాలిట శాపం. ఒక రోజు బస్తీ పెద్దాయన యాదమ్మ గుడిసె ముందుకు వచ్చాడు.

"ఏంది? యాదమ్మా! నీ యాడబిడ్డ అమ్మోరుకి అంకితమయింది గదా! నీ కూతుర్ని సెయ్యాలా! అమ్మోరు రాతిరి నా కల్లోకి వచ్చి సెప్పిందిలే! సొమ్ము ఇచ్చిపోతా. సాయం చేస్తూనె ఉంటా! నీకు పెనిమిటి లేడు. ఎవరు సూత్తారే? అంటూ 2 వేలు ఆమె చేతిలో పెట్టి పనైపోయినట్టు వెళ్ళిపోయాడు.

అంత డబ్బు చూడగానె యాదమ్మ మనసు మనసులో లేదు. ముందు వెనక ఆలోచించనే లేదు. ఓ పాత చింకి బట్టల సీనా రేకు పెట్టెలో అడుగున ఆ డబ్బును పెట్టింది. కూతురు అంతమ్మకు ఆ మాట చెప్పడానికి నోరు రాక యాదమ్మ విలవిల్లాడింది.

"నే బడికిపోయి సదువుకుంటా!" అంటూ అంతమ్మ బడికి బయలుదేర బోయింది,

"బిడ్డా! రాతిరికి సెప్పినాగా! బడికి ఎల్లబోక!"

"నే సదువుకుంటా! నే బడికి పోయి సదువుకుంటానే!" అంతమ్మ పేచీ పెట్టింది.

అంతమ్మ నడ్డిమీద రెండు దెబ్బలు వేసి లోపలికి లాక్కుపోయింది ఆ తల్లి.

"ఓ యమ్మా! నే ఆడుకుంటానే" అంటూ అంతమ్మ ఆ సాయంకాలం ఇంటిముందు మిగిలిన పిల్లలతో ఆడుకుంటూనే ఉంది.

"ఏందే యాదమ్మా! నీ కూతుర్ని జోగినిగా చేస్తావే? దాని బతుకులో నిప్పులు పోస్తావే? దానికి మొగుడు, కాపురం పిల్లలు ఏమీ వద్దే? కన్న కూతురు బతుకు

బుగ్గిపాలు సెయ్యడానికి నీది మనసు కాదే? బండరాయివా? ఛీ! ఛీ! నీ బతుకు మండ! అంటు కొందరు ఆడవాళ్ళు వచ్చి ఆమెను తిట్టిపోయారు. మరికొందరు మాత్రం “మంచి పని చేసినవావే! అమ్మోరు సేవకు కూతుర్ని పంపుతున్నావటగా! మంచిపని సేసినావే” అంటూ మెచ్చుకున్నారు.

యాదమ్మ అయోమయంలో పడినట్లు కొట్టుమిట్టాడింది. ఏదో పొరపాటు చేసినాననే దిగులు బయలుదేరింది. ఏ పని చేస్తున్నా అదే ఆలోచన మనసులో సుడిగాలిలా తిరుగుతోంది.

అదే బస్తీలో ఉంటున్న నరసింహం కొడుకు నారాయణంటే అంతమ్మకు చిన్నతనం నుంచి చాలా యిష్టం. తరచు కలిసి కబుర్లు చెప్పుకునేవారు. సరదాగా ఒకరినొకరు గిచ్చుకునేవారు. నారాయణ ఆమె నెత్తిన మొట్టికాయలు మొట్టి “నువ్వో పెంకి ఘటానివి” అంటూ వెళ్ళిపోయేవాడు. ఇప్పుడు నారాయణకు 20 సం॥ లు నిండాయి. వారిద్దరి స్నేహం మరింత బలపడింది. ఏదో తెలియని మమకారం అతని గుండెల్లో గూడుకట్టుకుంటోంది. యజమాని వెంట పనిమీద పట్నం వెళ్ళి తిరిగి రాగానే ముందు అతను కలిసేది అంతమ్మనే!

ఆ రోజు పట్నం నుంచి తిరిగి వచ్చిన నారాయణ ఆ వార్త వినలేకపోయాడు. అతని నెత్తిన పిడుగుపడి నిలువునా దహించినట్లయింది. అతని నుంచి అంతమ్మను ఎవరో దూరంగా లాక్కుపోతున్నట్లు అనిపించింది. అమ్మోరుకి అంతమ్మను బలి యిస్తున్నట్లు అనిపించింది. అంతమ్మను వెంటనే చూడాలని పరుగెత్తాడు.

అతన్ని చూడగానె అభం శుభం తెలియని చిన్నారి అంతమ్మ ఆడుకుంటున్న ఆటలు ఆపి, ‘నారాయణ’ అంటూ ఎదురు వెళ్ళింది. వారి గుడిసెల వెనుక అన్నీ బీడుపడిన పొలాలె. అడ్డదిడ్డంగా పెరిగిన పనికిరాని మొక్కల మధ్య ఇద్దరు వెళ్ళి కూర్చున్నారు. తరచు అక్కడే కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు.

‘నిన్ను బలి పశువును చేసి అమ్మోరుకి బలి ఇస్తున్నారు. నీకు తెలుసా!’ అన్న నారాయణ మాటలకి అంతమ్మ ఉలిక్కిపడింది.

‘బలి పశువా! ఏందీ! మొన్న అమ్మోరు గుడి దగ్గర సూసిన. దాని ముఖానికి పసుపు పూసి పెద్ద బొట్టు పెట్టారు. అది అమ్మో! అని అరుస్తుంటే సెవులు పట్టి లాక్కుపోతున్నారు. ఆడ సూసిన! అదేనా? నాకు భయమేసింది!’ అంది మేకపోతు కళ్ళముందు మెదలగా ఆమె భయంతో వణికిపోయింది.

"నిన్నూ అలాగె లాక్కుపోతారు. మీ యమ్మ మాట ఇనకు. ఆ కామందు దగ్గర పైసలు పుచ్చుకుని నిన్ను అమ్మేసింది మీ యమ్మ. మీ యత్త ఉన్నదిగా అలాగే నీవు కూడా జడలు కట్టి భయంకరంగా తిరుగుతావు. ఎరుకాయెనా?" నారాయణ మాటలకి అంతమ్మ ఏడుపు మొదలు పెట్టింది. నారాయణ ఆమె ఏడుస్తుంటే చూడలేకపోయాడు. 13 సం॥లు నిండుతున్నా ఏమీ తెలియని అమాయకురాలు అంతమ్మ. ఆమెను పొదివి పట్టుకుని గుండెలకు హత్తుకున్నాడు. ఆమెను చెవులు పట్టి లాక్కుపోతున్న వారిని అడ్డగించి నారాయణ కాపాడినట్లు అంతమ్మకు అనిపించింది. అమ్మ చెప్పినట్లు కాక నారాయణ చెప్పినట్లు వినాలను కుంది. దరిద్రంతో సంసారం ఈదలేక డబ్బుకు పిల్లలనే అమ్ముకుందని ఆ బిడ్డకు అప్పుడు తెలియదు. అప్పటికే చీకటి అలముకుంటోంది. ఇద్దరు కూర్చున్న చోటునుంచి లేచారు.

"నే సెప్పింది సెయ్యాలా! ఫో!" అంటూ నారాయణ ఆమె నెత్తిమీద ఎప్పటిలాగే రెండు మొట్టికాయలు మొట్టి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

అంతమ్మ కూడా అతని పక్కన కూర్చుంటె పొందిన తెలియని సంతోషాన్ని ఆస్వాదిస్తూ ఇల్లు చేరింది.

మనసునిండా అంతమ్మ అమాయకత్వం నిండివున్న నారాయణ అంతమ్మను ఏ విధంగానైనా కాపాడాలనుకున్నాడు. ఇంటికి వెళ్ళగానే తండ్రి ఎదురు వచ్చాడు. "నాయనా ఇన్నావా? ఆ పెద్దాయన చేసే పని ఇన్నావా? అంతమ్మని అమ్మోరికి ఇస్తున్నారంట! ఏటయ్యా! ఇది" బాధగా అన్నాడు.

"అవును నారాయణా! ఇన్నా! ఈ పెద్దోరంతా ఇంతే పాపం యాదమ్మని మోసం చేసి ఇంత సొమ్ము ఆమె చేతికిచ్చి అంతమ్మ జీవితం బూడిద చేస్తున్నారు. అందరం కలిసి అడగుదారి" అన్నాడు మరింత బాధగా.

నారాయణకు తండ్రి మాటలు మరింత నచ్చాయి. వెంటనే పెద్దాయన ఇంటికి పరుగెత్తాడు. "అంతమ్మని అమ్మోరికివ్వటం బాగాలేదయ్యా!" ఆయన ఇంటికి వెళ్ళి ఆయన ఎదురుగా వెళ్ళి తలవంచుకుని గబగబ ఆ నాలుగు మాటలు అనేసాడు.

పెద్దాయన అనుచరులు అటు ఇటు చేతులు కట్టుకుని నిలబడ్డవారు ఆశ్చర్యపోయి నోరు వెళ్ళబెట్టి రాతిబొమ్మల్లా చూస్తున్నారు.

"ఏందిరా? నువ్వెవడివిరా! నాకు చెప్పడానికి! చంపేస్తా! జాగ్రత్త! నోరు మూసుకుని ఉండు! అమ్మోరుని ఏదైన అంటే రక్తం కక్కుకు సత్తావు" అంటూ కళ్ళెర్ర చేస్తూ మీసాలు మెలేసాడు పెద్దాయన.

అది కాదయ్యా! ఏదో చెప్పబోయాడు నారాయణ!

"నువ్వు చెప్పడం నేను వినడమా? పోరా! పో! పోరా!" ఆయన చీదరించు కున్నాడు.

అయినా నారాయణ ఏదో చెప్పాలనుకున్నాడు. ఆయన మనుష్యులు యజమాని మనసు తెలుసుకొని నారాయణను బయటకు "నడు నడు" అంటూ వెంటబడి తరిమేశారు.

నారాయణకు ఆయన స్వభావం తెలుసు కనుక ఏమీ నిరుత్సాహపడలేదు. పట్టుదల మరింత పెంచుకున్నాడు. ఎలాగైనా అంతమ్మను కాపాడాలనుకున్నాడు. ఇంటికెళ్ళి తండ్రికి ఏం చెప్పలేదు. అన్నం తిని ఏమీ తెలీనట్లు పడుకొని పొద్దుటే లేచి మామూలుగా పనికివెళ్ళిపోయాడు.

"ఏందే? ఏడకు పోయినావు? ఆ నారాయణ కాడికేనా? నీకు సెప్పినా గదా! ఇంక ఏడకి పోక! పెద్దాయనకు తెలిస్తే! కోప్పడతడు" అంది తల్లి బాధగా.

అంతమ్మ ఆ మాటలు పట్టించుకోలేదు. కాస్త కూడు తిని.... కుక్కి నులక మంచం మీద వాలిపోయింది. ఆకాశంలో చందమామను చూస్తూ పడుకుంది. ఆమె కలల నిండా ఆకాశంలో చందమామలా నారాయణ మెదిలాడు.

"తెల్లారింది లేవండోయ్" అన్నట్లు కోడిపుంజు పక్కవాళ్ళ గుడిసె యెక్కి 'కొక్కొరొకో' అంటు గొంతెత్తి అరిచింది. అప్పుడే లేచిన కాకులు వెలుగు రాకుండానే "కావు! కావు" మంటూ పెరటి కంచె మీద కూర్చుని అరుస్తున్నాయి.

యాదమ్మ బద్ధకంగా లేచింది. లేవాలని లేకపోయినా బతకాలంటే చాకిరీ తప్పదు. "ఆ కోడి పుంజుకు, ఆ కాకులకు ఈ చాకిరీలు, ఈ బాధ్యతలు ఉండవు కాబోలు, పొద్దుటే లేచి హాయిగా తిరుగుతాయి. ఈ మడిసి జన్మ కంటె వాటి బతుకే నయం" అనుకుంది యాదమ్మ. "ఆ పెద్ద మనిషి ఇచ్చి వెళ్లిన 2వేలు ఖర్చు అయిపోయాయి. మళ్ళీ తిండికి వెతుకులాటే! మళ్ళీ కడుపులో ఆందోళన. కూతురు జీవితం నాశనం చేస్తున్నాననే భయం. ఆ కూతురు తన మాట ఇనకపోతే? అమ్మో! అమ్మోరుకి కోపమొచ్చేస్తుంది. ఊరును గల్లంతు చేసేస్తుంది ఎలాగో ఏందో?"

యాదమ్మ మనస్సు అంతా కంగారుకంగారుగా ఉంది. ఇంకా అంతమ్మా, పిల్లలు నిద్ర లేవనే లేదు. అంతలో ఆ పెద్దమనిషి మళ్ళీ వచ్చాడు. ఆయన కళ్ళు పెద్దవై అంతమ్మ కోసం వెతుకుతున్నాయి. తల్లికి దూరంగా ఓ గుడిసె కట్టించి అందులో జోగిని అంతమ్మను పెట్టటానికి ఏర్పాట్లు చేయిస్తున్నాడు.

"యాదమ్మా!" అంటు పిలిచిన ఆయన గొంతు విని యాదమ్మ బయటకు ఒక్క అంగలో వచ్చింది.

"ఇదిగో యాదమ్మా! ముహూర్తం పెట్టించేసినా. ఇక 3 రోజులే ఉంది. శుక్రవారమే! పొద్దుటే 9 గం॥లకే తంతు పూర్తవ్వాల! చేతిలో ఖర్చుకుంచుకో" అంటు మళ్ళీ మరో 1500 రూపాయలు చేతిలో పెట్టి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెనుదిరిగి వెళ్ళాడు. ఆయన వెనకే ఇద్దరు యమభటుల్లా దుడ్డుకర్రలతో నడిచారు.

ఆ డబ్బు చూడగానే యాదమ్మ మనసు మారిపోయింది. "అమ్మో! అమ్మోరుకు కోపమస్తది. అంతమ్మకు సెప్పి సేయించాలా!" లెంపలేసుకుని తిరిగి డబ్బు దాచుకుంది.

"ఇంకా 3 రోజులుందిగా! అప్పుడే ఎందుకు చెప్పటం, అప్పుడు చెప్పచ్చులే" అనుకుంది. అయినా ఆ నారాయణతో మాత్రం కలవనివ్వకూడదనుకుంది.

పెళ్ళి ముందురోజు సాయంకాలం తల్లి కళ్ళు కప్పి అంతమ్మ నారాయణను కలిసింది.

"నీకు తెలుసా? నీ పెళ్ళట! జాగ్రత్త! నువ్వు బాగా అల్లరి సెయ్యి. పెళ్ళొద్దని పేసీ పెట్టాలా!" అన్నాడు.

అంతమ్మ నిజంగానే ఆశ్చర్యపోయింది. విడవలేక అతన్ని విడిచి ఉండలేక అంతమ్మ ఇల్లు చేరింది. తిరిగి తల్లి తిట్టింది. కొట్టింది. నారాయణను ఇకపై కలవకూడదని మళ్ళీ మళ్ళీ చెప్పింది.

ఆ రోజు నారాయణ ఇంటికి వస్తుంటే దారిలో అతని పక్కింటి కేశవ కలిసాడు. "ఇన్నావా నారాయణా! ఆ పెద్దాయన యాదమ్మకు డబ్బిచ్చిపోయిండట! అంతమ్మకు పెళ్ళట! ఇగ రేపే పెళ్ళట" అన్నాడు. నారాయణ ఆ మాటలు వినగానే అతన్ని మరింకేమి అడగలేదు. అక్కడ నుంచి పరుగెత్తి యాదమ్మ ఇల్లు చేరుకున్నాడు. "యాదమ్మత్తా! యాదమ్మత్తా!" ఉన్నా యే అంటూ ఆ పాకలాంటి నివాసంలో అడుగుపెట్టాడు.

"ఏంది బిడ్డా! ఏంది!" అతనికి ఎదురు వచ్చింది యాదమ్మ.

"ఏంది? నే ఇన్నది నిజమేనా? యాదమ్మత్తా!" అంటూ నిలదీసాడు.

"ఏందిరా! ఏంది?" అన్నది కాని, ఆమె ముఖం వెలవెలబోయింది.

"పెద్దాయన దగ్గర తిరిగి డబ్బుచ్చుకున్నావటగా! అంతమ్మ గొంతు కొయ్యబోక!" అన్నాడు నారాయణ కోపంగా.

యాదమ్మ ఆ మాటలకి "ఈడికెలా తెలిసింది" అనుకుని మనసులో కాస్త భయపడినా పైకి ధైర్యం నటించింది.

"ఏంది నారాయణ! పెద్దాయన డబ్బు నాకెందుకిస్తాడయ్యా! అంది అమాయకంగా మొహంపెట్టి.

"అత్తమ్మా! దబాయించక నా కన్నీ తెలుసు. ఇదిగో అంతమ్మని జోగినిగా మార్చినావో నే వూరుకోను చూడు అంటూ గబగబా వెనక్కి వెళ్ళిపోయాడు.

"అమ్మో! ఈడేం చేస్తాడో? ఇదేం గోలో" అనుకుంది యాదమ్మ.

ఆ రాత్రి యాదమ్మకు కంటికి నిద్రదూరమయింది. నారాయణ పెళ్ళిలో నిజంగానే గొడవ చేస్తాడేమో? ఆ పెద్దాయన ఏం చేస్తాడో?" యాదమ్మ భయంతో వణికిపోయింది.

ఈ పెళ్ళి ఎలా తప్పించాలో? ఆ నారాయణ ఇంక నాకు కనిపించడేమో? అనుకుంది అంతమ్మ. ఆమె కళ్ళమ్మట నీళ్ళు ధారలు కట్టాయి. ఆమెకు అంతకంటె ఆలోచించే శక్తిలేదు. ఇప్పుడే తల్లి నారాయణను కలవ వద్దని తిడుతోంది. ఇంక పెళ్ళయితే నారాయణను అసలు కలవ నివ్వదు. ఆమె బాధ అదే! అంతకంటే ఆమె చిన్న మనసు ఆలోచించలేకపోయింది.

నారాయణకు ఆ రాత్రి అసలు నిద్రపట్టలేదు. అంతమ్మను జోగినిగా మారుస్తున్నారంటే అతని ప్రాణాన్ని ఎవరో బలవంతంగా నొక్కేస్తున్నట్లు అనిపించింది. ఆ పెళ్ళి ఎలా ఆపాలో తెలీక ఆలోచిస్తూనే ఉన్నాడు. చివరకు ఎలాగైనా ఆ దురాచారం ఆపించాలని నిశ్చయించుకున్నాడు. చివరకు అలసి, సొలసి నిద్రలోకి జారుకున్నాడు.

చీకటి కాపలా అయిపోయినట్టు తెల్లారింది. ఊరంతా సందడిగా ఉంది. అంతమ్మ జోగిని అయిపోతోంది. పశువులు, పక్షులు కూడా జాలిగా చూస్తున్నాయి.

నారాయణ ఏమూల నుంచి వచ్చి అల్లరి చేస్తాడోనని పెద్దయ్య కొందర్ని కాపలాపెట్టించాడు. మీ ముందుకు రావడానికి అడికి ఎన్ని గుండెలున్నాయండీ! మేమున్నాముగా! అడి కాళ్ళు ఇరక్కొట్టేస్తాము అన్నారు వాళ్ళు.

వారి మాటలకి పెద్దయ్య మీసాలు మెలేసి నవ్వుకున్నాడు.

దగ్గరలో ఉన్న అమ్మోరు గుడిని అలంకరించారు. అంతమ్మకు పసుపు స్నానం చేయించారు. కొత్త బట్టలు కట్టారు.

"నా కొద్దీ పెళ్ళి! నే సేసుకోను! నే బడికిపోయి సదువుకుంటా! అంటు ఏడుస్తోంది. గింజుకుంటోంది అంతమ్మ. అయినా ఆమెను అందరు ఆడవాళ్ళు పట్టుకున్నారు. ముఖానికి పసుసురాసి పెద్ద కుంకుమబొట్టు పెట్టారు. చెంపలకు చేతులకు గంధం పూసారు. గంధపుగిన్నెను ఏడుస్తూ తోసేసింది అంతమ్మ. గాజులు తొడుగుతుంటే చేతులు తోసేసింది. పెద్ద గొంతుతో అరుస్తోంది. ఏడుస్తోంది. ఆ పెద్దమనిషి, ఆయన కొడుకు, ఇంకా కొందరు అక్కడ నిలబడి చూస్తూ నవ్వు కుంటున్నారు.

ఆమెను బలవంతంగా గుడికి లాక్కుపోతున్నారు. ఆనాటి మేకపోతు కళ్ళముందు కదిలింది అంతమ్మకు. ఆమె అరుపులు, కేకలు ఎవరికి బాధ కలిగించలేదు.

మూర్ఖత్వం ముసుగులో దురాచారాలు సాగిపోతున్నాయి. వాటికి అంతమ్మ అంతం పెట్టలేకపోయింది. అంతా సిద్ధమైపోయింది.

అంతలో నారాయణ పోలీసులతో అక్కడ ప్రత్యక్షమయ్యాడు. పోలీసులను చూడగానె అందరూ బిగుసుకుపోయారు. పోలీసుల నుండి తప్పించుకోవడానికి ఆ పెద్దమనిషి కాలికి బుద్ధి చెప్పాడు. కాని ఆ పోలీసులు అతన్ని వదలలేదు. ఆ తండ్రీ కొడుకులను యాదమ్మను పోలీసు స్టేషనుకు లాక్కుపోయారు. అంతమ్మను అనాథ బాలికల పాఠశాలకు పంపించారు. మైనారిటీ తీరేవరకు అక్కడే ఉండి చదువుకోవాలి. నారాయణ పోలీసులతో కలిసి వెళ్ళిపోయాడు. జైలు నుంచి వచ్చాక నారాయణ పని పడతానన్న ఆ పెద్దమనిషి ఏమీ చెయ్యలేకపోయాడు.

"ఒరేయ్! అమ్మోరును ఎదిరించావురా! రక్తం కక్కుకు చస్తావురా! అమ్మోరు నిన్ను వదలదురా!

ఊరికి ఇంత అపకారం చేస్తావురా?" అంటూ పెద్దయ్య తిట్టిన తిట్లన్ని కూడా వ్యర్థమై పోయాయి.

నారాయణకు ఏ అపకారం జరగలేదు.

"పెద్దోళ్ళతోటి నీకేందిరా! జైలునుంచి వస్తే ఆళ్ళు నిన్ను చంపేస్తారురా! జాగ్రత్త!" ఊరి వదలిపోరా! అంటూ నారాయణ తల్లి భయపడిపోయింది.

"ఊళ్ళో ఎవరూ ధైర్యం సేయలేక బోయారు! ఈడు సేసిండే? ఏంది భయం! మేమంతా లేమా? ఏందే చూసినావా? ఆ పెద్దాయన చెల్లినీ బిడ్డనీ ఆ జోగినిగా సేయొచ్చునా, మన లాటోళ్ళనే ఎందుకు సెయ్యాలో? ఆలోసించినావా?" అన్నాడు నారాయణ తండ్రి యాద్గిరి.

"నిజమే" అంది తల్లి ముక్కున వేలేసుకుని.

"నారాయణ మంచిపనే సేసిండు" అంది నవ్వుతూ ఆ తల్లి!

అమ్మోరుకి కోపమొచ్చి సెపించేస్తుంది! ఏ ప్రళయమొచ్చేస్తుందో! అని జనాలు భయపడిపోయారు. ధూపం వేసారు. హారతులిచ్చారు. అమ్మోరు చల్లని తల్లి! ఏమీ చెయ్యలేదు. ఊరు చల్లగానే ఉంది.

ఆనాడు ఆ బలిపశువు తప్పించుకోలేకపోయింది. ఈ బలి పశువు మనిషి. అందుకే తప్పించుకోగలిగింది.

ఇప్పుడు అంతమ్మకు 18 సం॥ నిండాయి. ఆశ్రమబడి నుంచి ఇంటికి బయలుదేరింది. తల్లేకాదు ఆమెను చూచి ఉరిదిమంది ఆశ్చర్యపోయారు. అంతమ్మకు మంచి రంగు వచ్చింది. పొడుగయింది. పైగా చదువు నేర్చుకుంది. చక్కటి నేత చీర కట్టి వాలుజడ వేసుకుని కాలికి చెప్పులు తొడిగి పట్నం పిల్లలా నడుచుకుంటూ వస్తుంటే చూపులు మరల్చుకోలేకపోయారు ఆ వూరి జనం.

నారాయణ ఆమెను కలుస్తూనే ఉన్నాడు. అందుకే ఆమెకు తగిని విధంగా నారాయణ వేష భాషలూ మారిపోయాయి. ఆ రోజు అమ్మోరు గుడిలో అంతమ్మ, నారాయణల వివాహం. ఊరిడిమంది తరలి వచ్చారు. అందరూ ఆ కొత్త జంట సీతారాముల్లా ఉన్నారని సంబరపడ్డారు. అందరూ అక్షింతలు వేసి దీవించారు. ఆ అమ్మోరు తల్లి కూడా చల్లని చూపులతో ఆ దంపతులను ఊరికి మంచి పనులు చేస్తూ చల్లగా ఉండాలని దీవించినట్లు అనిపించింది.

మూసీ-మాసపత్రిక జనవరి 2006.